సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
శుక్రవారం 6-12-2024
సంపుటి: 20 సంచిక: 215
పేజీలు: 4 వెల: రూ.1

## పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య..!?

- ✔ మృతిపై తల్లిదండ్రులు అనుమానం
- ✔ గతంలో జరిగిన క్రైమ్‌కు మృతుడే సాక్షి
- ✔ ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్
- ✔ కేసు నమోదు చేసిన పోలీసులు



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ఎస్ఎం పురం గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న జలుమూరు మండలం పర్లాంమాకివలస గ్రామానికి చెందిన ముద్దాడ దిలీప్(15) శుక్రవారం ఉదయం అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. మృతిపై తల్లిదండ్రులు వాసుదేవరావు, లక్ష్మీ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు చెబుతున్న వివరాల ప్రకారం.. ప్రతి రోజు డిన్నర్ పూర్తిచేసిన తర్వాత స్టడీ అవర్ - మిగతా 4లో

# డబ్బులు కట్టి దెబ్బలు తింటున్నారు

- విద్యార్థులపై పైశాచికంగా దాడిచేసిన బీవీ రమణ
- ఇండియన్ ఆర్మీకాలింగ్ హాస్టల్‌లో హింస
- రెండు రోజులుగా హల్‌చల్ చేస్తున్న వీడియోలు
- అనుమతులు లేకపోయినా కొనసాగుతున్న సంస్థ
- వ్యవస్థాపకుడి మానసిక స్థితిపై సర్వత్రా అనుమానాలు
- చర్యలు తీసుకోవాలని నారా లోకేష్‌కు ట్వీట్





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**అన్నయ్యా.. మీరు చాలా సీరియస్‌గా యాక్షన్ తీసుకోవాల్సిన ఇష్యూ ఇది. శ్రీకాకుళం జిల్లా ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థకు ఫౌండర్ ప్రెసిడెంట్ అయిన రమణ అనే వ్యక్తి వేలాది మంది స్టూడెంట్స్ జీవితాలతో ఆడుకుంటున్నాడు. ఆర్మీలో, నేవీలో, ఎయిర్‌పోర్టులో ఉద్యోగాలిప్పిస్తామని విద్యార్థుల దగ్గర రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేస్తున్నాడు.**

***.. ఇది రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు టాగ్ చేస్తూ 'ఎక్స్' పోస్ట్ చేసిన మెసేజ్. ఇందుకు సంబంధించి ఇండియన్ ఆర్మీ కాలింగ్ హాస్టల్‌లో ఒక విద్యార్థిని యూఎస్‌బీ కేబుల్ మడతపెట్టి చితకబాదుతున్న వీడియోను అటాచ్ చేశారు.***

ఇప్పుడు నగరంలో ఉన్న ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థ వ్యవస్థాపకుడు బీవీ రమణకు సంబంధించే రాష్ట్రవ్యాప్తంగా చర్చ నడుస్తుంది. కరోనా తర్వాత ఆర్మీలో ఉద్యోగాల కోసం జిల్లా విద్యార్థులు ఎక్కడెక్కడికో వెళ్లాల్సి వస్తుందని, అలా కాకుండా శ్రీకాకుళంలోనే అందుకు సంబంధించిన విద్య, శిక్షణ ఇచ్చి ఉద్యోగాలకు సిద్ధం చేస్తామని ప్రకటిస్తూ శ్రీముఖలింగానికి చెందిన బీవీ రమణ శ్రీకాకుళంలో ఇండియన్ ఆర్మీ కాలింగ్ పేరిట ఒక సంస్థను స్థాపించారు. నిజంగా జిల్లా విద్యార్థులకు ఇది ఉపయోగపడుతుందనే భావనతో ఈ సంస్థ ప్రారంభించిన కొద్ది రోజులకే 'సత్యం' దీని మీద ఓ పాజిటివ్ కథనాన్ని అందించింది. తాజాగా రెండు రోజుల నుంచి ఈ సంస్థ వ్యవస్థాపకుడు సైకో తీరును పట్టి చూపుతున్న వీడియోలను చూసిన తర్వాత ఇటువంటి కథనం ప్రచురించినందుకు 'సత్యం' చింతిస్తోంది. జిల్లా నుంచి దేశసేవకు వెళ్లాలన్న విద్యార్థుల ఆశలు ఏమేరకు నెరవేరాయో తెలీదు గానీ, బీవీ రమణ తన సైకో ప్రవృత్తిని ప్రదర్శించడానికి బలిపశువుల్లా మాత్రం మన జిల్లా విద్యార్థులు ఉపయోగపడుతున్నారు. తాజాగా ట్రోల్ అవుతున్న వీడియోలు చూస్తే ఎవరైనా ఇదే మాట చెబుతారు. రక్షణ రంగంలో సేవలందించాలంటే శారీరక దృఢత్వం మాత్రమే ఉంటే చాలదు. మానసికంగా కూడా మరింత దృఢంగా సైనికుడు ఉండాలి. అటువంటి - మిగతా 4లో




## నిజమే..! బడి పంతుళ్లు బతకలేకపోతున్నారు

- సీహెచ్ దుర్గాప్రసాద్



**మొన్న జరిగిన రెండు ఘటనలు...**

- *అన్నమయ్య జిల్లా రాయచోటిలోని కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడ్నే కొట్టి చంపిన విద్యార్థులు.*
- *హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఉన్న సంధ్య 35 ఎంఎం థియేటర్‌కు అర్ధరాత్రి తన పిల్లలతో సహా పుష్ప-2 సినిమా చూడటానికి వెళ్లి తొక్కిసలాటలో మృతిచెందిన మహిళ.*

**సమాజంలో పిల్లల పెంపకం ఎలా మారిందో చెప్పడానికి ఇంతకంటే గొప్ప నిదర్శనాలు ఉండవు.**

క్లాసులో నిశబ్ధంగా ఉండమని చెప్పినందుకు ఒక టీచర్ని తొమ్మిదో తరగతి విద్యార్థులు కొట్టి చంపారు. ఇది కింద పోస్టు చేసిన వార్త సారాంశం. ఇది చాలామందికి ఒక డబుల్ కాలమ్ వార్త. మరి కొంతమంది ఇది మన స్కూల్లో, మన ఊర్లో కాదు కదా అనుకోవచ్చు. కానీ ఈ నీచ సంస్కృతి చెద మాదిరి ప్రతి స్కూల్‌కి వ్యాపిస్తుంది. ఎవరిని నిందించాలి.. తల్లిదండ్రులనా, టీచర్లనా, వ్యవస్థనా...? ఇది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ వారంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తల్లిదండ్రుల సమావేశాన్ని ఉద్దేశించి నిన్న విద్యాశాఖ కార్యదర్శి ప్రెస్‌మీట్ పెట్టారు. ఒక గొప్ప కార్యక్రమం.. అనుమానం లేదు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను స్కూళ్లకు రప్పించడం ఒక గొప్ప చాలెంజ్ అంటున్నారు. ఇది నూటికి నూరుశాతం వాస్తవం. వేల రూపాయిలు ఫీజుకట్టించుకున్న స్కూళ్ల యాజమాన్యాలు పేరెంట్స్ మీట్ పెట్టినా పావు వంతు తల్లిదండ్రులు రారు. ఈ మధ్య ఒక స్కూల్ వారు ఒక ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడుతో ఆర్ట్ ఆఫ్ పేరెంటింగ్ నిర్వహించాలి అనుకున్నారు. దాని కోసం ఒక లక్ష రూపాయలు ఖర్చు పెట్టడానికి సిద్ధపడ్డారు. కానీ చివరికి ఆ కార్యక్రమం వాయిదా పడింది. కారణం తల్లిదండ్రులు రావడానికి - మిగతా 4లో



### విద్యార్థుల దాడితో మనస్తాపానికి గురై మృతి

- గాయాలకు అవమానం తోడై కుప్పకూలిన ఉపాధ్యాయుడు
- పోలీసుల అదుపులో ముగ్గురు తొమ్మిదో తరగతి బాలురు

ఈనాడు- కడప, న్యూస్‌టుడే - రాయచోటి: అన్నమయ్య జిల్లా రాయచోటిలోని కొత్తపల్లి ఉర్దూ జడ్పీ ఉన్నత పాఠశాలలో సత్ప్రవర్తన లేని విద్యార్థులను మందలించి, వారు దాడి చేయడంతో ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటనపై ఆర్డీవో శ్రీనివాసులు, పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ గురువారం విచారణ చేపట్టారు. ఉపాధ్యాయుడు ఏజాష్ అహ్మద్ (42) బుధవారం ఓ తరగతిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. పక్కనే ఉన్న తొమ్మిదో తరగతి గదిలో విద్యార్థుల అల్లరి చేస్తుండడంతో అక్కడికి వెళ్లి విద్యార్థులను మందలించారు. వీరిలో కవల పిల్లలున్నారు. వారిలో ఒకరిపై హెచ్చరికగా ఉపాధ్యాయుడు చేయి చేసుకున్నారు. దీంతో ఆ విద్యార్థి, అతని సోదరుడు ఉపాధ్యాయుడిపై తిరగబడ్డారు. మరో విద్యార్థి కూడా అహ్మద్‌పై దాడికి పాల్పడ్డారు. విద్యార్థులు తనపై దాడి చేయడాన్ని జీర్ణించుకోలేక ఆయన తీవ్ర వేదనకు గురయ్యారు. సహచర ఉపాధ్యాయులు ఆ విద్యార్థులతో క్షమాపణ చెప్పించే ప్రయత్నం చేయగా అహ్మద్ ఆవేదన వ్యక్తం చేస్తూ తిరస్కరించారు. కొద్దిసేపటికే కూర్చున్న కుర్చీలోనే కుప్పకూలిపోయారు. సహచరులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై విచారణాధికారులు ఉన్నతాధికారులకు ప్రాథమిక నివేదిక అందించారు.

ఉపాధ్యాయుడు ఏజాష్ అహ్మద్

**చేతి కడియంతో దాడి?:** ఉపాధ్యాయుడిపై దాడి చేసిన ముగ్గురు విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పిల్లలు దురలవాట్లకు లోనైనట్లు విచారణలో తేలింది. కవలల్లోని ఒకరి వద్ద కడియం ఉంటుందని, ఎవరైనా ఏమైనా అంటే దాన్ని చేతికి వేసుకుని, దాడి చేస్తాడని సహచర విద్యార్థులు చెబుతున్నారు. ఉపాధ్యాయుడిపై దాడి సమయంలోనూ దాన్ని ఉపయోగించారని.. దీంతోనే ఆయనకు ఎడమ కన్ను వద్ద గాయంతో పాటు కళ్లజోడు పగిలిపోయిందని పేర్కొన్నారు. నిందితులకు గంజాయి అలవాటు ఉందనే అనుమానాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం ఉపాధ్యాయుడి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించగా, అంత్యక్రియలు పూర్తి చేశారు. తన భర్త మరణానికి కారకులపై చర్యలు తీసుకోవాలంటూ.. మృతదేహాన్ని తరలిస్తున్న అంబులెన్స్ ఎదుట మృతుని భార్య రెహామూన్, కుటుంబసభ్యులు నిరసనకు దిగారు. ఘటనపై అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లో ఉపాధ్యాయ సంఘాలు పెద్దఎత్తున నిరసనలు చేపట్టాయి.

• ఎడిటోరియల్

# ఆ ప్రశ్నలకు బదులేది?

ప్రశ్నకూ, విమర్శకూ భయపడే పాలకపక్షం ఎంత బలవంతమైనదైతే మాత్రం ఏం ప్రయోజనం? ప్రశ్నలకు జవాబు చెప్పలేనప్పుడు ఏం సుఖం? ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల తీరు గమనిస్తే బోధపడే సారాంశమిదే. పార్లమెంటు మన శాసనవ్యవస్థకే తలమానికమైన చట్టసభ. దేశానికే దిశానిర్దేశం చేసే అత్యున్నత ప్రజాప్రాతినిధ్య వేదిక. అలాంటి చోట ఏ చర్చకూ అవకాశం లేకుండా పోయాక ఇక మన ప్రజాస్వామ్యానికి అర్థమేముంటుంది? నవంబర్ 25న ప్రారంభమైన పార్లమెంటు సమావేశాలు ఇలా మొదలు.. అలా వాయిదా అన్న ధోరణిలో జరుగుతున్న తీరు చూస్తే ఎవరికైనా కలిగే అభిప్రాయం ఇదే. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సెబీని అడ్డం పెట్టుకుని ఆయా రాష్ట్రాలతో ఎక్కువ ఖరీదుకు విద్యుత్ ఒప్పందాలు చేసుకుని రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడిన అదానీ కుంభకోణంపై జాయింట్ పార్లమెంట్ కమిటీ వేయాలన్న విపక్షాల డిమాండ్‌ను కేంద్రం ఎందుకు పట్టించుకోదు. ప్రతి పక్ష నేతలపై ఈడీలను, సీబీఐలను ఉసిగొలిపే ప్రభుత్వం ఐదు రాష్ట్రాల్లోని రాజకీయ నేతలకు రూ. 2029 కోట్ల ముడుపులు ముట్ట జెప్పినట్టు అదానీ కంపెనీ రాసుకున్న పత్రాల్లో తేలినా చర్యలకు ఎందుకు ఉపక్రమించడం లేదు? మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లకు బాధ్యులైన ఆ రాష్ట్ర సీఎంపై చర్యలు తీసుకోవడం, మహారాష్ట్ర ఎన్నికల్లో జరిగిన చట్ట ఉల్లంఘనలు, దేశానికి అవసరమైన మౌలికాంశాలపైన పార్లమెంట్‌లో చర్చ జరపాలని ప్రతిపక్షాలు పట్టుపడితే ఎన్డీయే ప్రభుత్వం తప్పించుకు తిరుగుతోంది. అవినీతిలో, బంధుప్రీతిలో అస్మదీయులకు ప్రజాసంపద దోచిపెట్టడంలో గత పాలకుల కంటే రెండాకులు ఎక్కువే చదివారు నేటి పాలకులు. వీరి హయాంలో అవినీతిని వ్యవస్థీకృతం చేయడంలో మరింత పెంచి పోషించింది తప్ప.. దానిని అరికట్టడానికి తీసుకున్న చర్యలు శూన్యం. కార్పొరేట్లకు దోచిపెట్టడానికి వల్లమాలిన ప్రేమ ఒలకబోసే ఈ నేతలే అవినీతి గురించి గురివింద మాదిరి నైతిక విలువలను వల్లిస్తున్నారు. విదేశాల్లో దాచిన నల్లడబ్బును వందరోజుల్లో వెనక్కు తెచ్చి పేదల ఖాతాల్లో రూ.15లక్షలు చొప్పున జమచేస్తానన్న ఎన్నికల వాగ్దానాన్ని మూడు వేల రోజులు గడిచినా రాకపోవడంతో చివరకు ఎన్నికల తమాషాగా దాన్ని తేల్చివేశారు. మరి ప్రధాని పేదల కోసమే పడే ఆరాటం, పోరాటం ఏమైపోయాయి? అని అడిగితే నేరం. పనామా పత్రాలు, బహమస్ లీకులు వెల్లడించిన భారత నల్లకుబేరులపై కనీస చర్యలు కూడా తీసుకోలేదు. అంతెందుకు, అవినీతిని అంతం చేస్తానంటున్న మోడీ, దేశంలో పెచ్చరిల్లిన అవినీతికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రజాందోళన తదుపరి లోక్‌పాల్ బిల్లును పార్లమెంట్ ఆమోదించి ఏళ్లు గడిచినా ఇంతవరకు ఎందుకు నియమించలేదు! నిజంగా నేరస్థులో కాదో తెలియకుండానే దేశవ్యాప్తంగా లక్షలాది విచారణ ఖైదీలు కారాగారాల్లో మగ్గిపోతున్నారు. అవినీతిని ఆరోప్రాణంగా భావించే పెద్దమనుషులేమో నాయకులై.. చట్టానికి చుట్టాలై రాజకీయ చక్రం తిప్పుతున్నారు. క్విడ్ ప్రో కో పద్ధతిలో పంచుకుంటూ, తమ చేతులకు మట్టి అంటకుండా, మూడో కంటికి తెలియకుండా డబ్బును భారీయెత్తున దేశం దాటించే అదానీ, విజయ్ మాల్యా, నీరవ్‌మోడీ లాంటి బడాబాబులెందరు? విదేశాల్లో తలదాచుకుంటున్న ఇలాంటి వారిపై చర్యలంటే పాలకులకు వణుకెందుకు? అవినీతి జగత్తుకు మకుటంలేని మహారాజులైనప్పటికీ వారందరూ కాషాయ తీర్థం పుచ్చుకోగానే అగ్నిపునీతులైపోతున్నారు. అవినీతి తిమింగిలాల జాబితాలో ఇప్పుడున్న పేర్లు మొదటివి కావు.. ఆఖరివి అంతకంటే కాబోవు! అభివృద్ధికి, పేదల సంక్షేమానికి అక్కరకు రావాల్సిన జాతి వనరులను రాజకీయాలే దిగమింగుతున్నాయి. ఈ పార్లమెంట్ సమావేశాల ప్రారంభమైన రెండోరోజే రాజ్యాంగ దినోత్సవం.. దానిలో రాజ్యాంగస్ఫూర్తిని కొనసాగిస్తామని చెప్పిన ప్రధాని, ఇదే రాజ్యాంగపు విలువలను ఇదే సమావేశాల్లో అటకెక్కించారు. పార్లమెంట్ వేదికగా ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనపై నోరువిప్పని ప్రధాని.. అవినీతిని రూపుమాపుతామంటూ జబ్బలు చరవడం హాస్యాస్పదం కాక మరేమిటి? "తమ విధానాల ద్వారా 2లక్షల కోట్లు అవినీతిపరుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడగలిగాం" అని చెప్పే ప్రధాని.. బడానేతలు బ్యాంకులకు ఎగ్గొట్టిన లక్షల కోట్లు సంగతి దాచారా? మరిచారా? చర్చకూ ప్రశ్నకూ అవకాశమివ్వని ఈ సమయ హననం అంతకంతకూ వేగం పుంజుకుంటోందనడానికి ఈ సమావేశాలు ఓ మచ్చుతునక. ప్రతిపక్షాల గొంతు నొక్కే నిరంకుశ పోకడలకు ఇదో పరాకాష్ట. ఈ స్థితిని ప్రతిఘటించడం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం అందరి కర్తవ్యం.



దేవేంద్ర ఫడ్నవీస్.. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నాడు. పుట్టింది నాగపూర్.. ఆర్ఎస్ఎస్ మూలాలు.. ఈసారి బీజేపీకి మంచి సీట్లు రావడంతో చిన్నాచితకా అడ్డంకులు తొలగించిన హైకమాండ్ తన సీఎం పదవికి దారి క్లియర్ చేసింది. తన వివరాలే కాదు, ప్రస్తుతం ఆయన భార్య వివరాల సెర్చింగు సాగుతోంది అధికంగా.. ఆమె పేరు అమృత.. తనదీ నాగపూరే.. ఫడ్నవీస్ రాజకీయాలు, ముఖ్యమంత్రిత్వంతో ఏ సంబంధమూ లేకుండా ఆమెది ఓ సపరేట్ కెరీర్.. ఎప్పుడూ వార్తల తెర మీద కనిపించే ఆమెది ఓ సమాంతర ప్రజాజీవితం.

# సీఎం భార్యలందు.. అమృత స్టోరీయే వేరయా!

తండ్రి శరద్ పాపులర్ ఆప్తమాలజిస్టు.. తల్లి చారులత గైనకాలజిస్టు.. అమృత అక్కడే కామర్స్ గ్రాడ్యుయేట్, తరువాత పూణెలోని సింబయాసిస్‌లో ఎంబీఏ చేసి యాక్సిస్ బ్యాంకులో చేరింది. ఫడ్నవీస్ ముఖ్యమంత్రి అయ్యాక కూడా ఆమె బ్యాంకులో జాబ్ మానలేదు. ఇప్పుడు ఆమె బ్యాంకు వైస్ ప్రెసిడెంటు..

ఆమె చిన్నప్పుడే సంప్రదాయ, శాస్త్రీయ సంగీతం నేర్చుకుంది. స్కూల్‌లో అండర్ 16 స్టేట్ ప్లేయర్.. బ్యాంకు ఉద్యోగం చేస్తూనే పలు కమర్షియల్, సోషల్ సాంగ్స్ పాడేది. సినిమా, ప్రైవేట్ సాంగ్స్ కూడా.. పలు అవార్డులు కూడా వచ్చాయి. ఇవే కాదు చురుకైన సోషల్ యాక్టివిస్టు ఆమె.



దివ్యాజ్ ఫౌండేషన్ (బిడ్డ పేరు దివిజ) పెట్టి పలు యాక్టివిటీస్ చేస్తుంటుంది. ఓసారి యాసిడ్ అటాక్స్ బాధితులతో ఓ ఫ్యాషన్ షో నిర్వహించింది. ఇండో-చైనా శాంతి పేరిట మానస సరోవర్ యాత్రను లీడ్ చేసింది. ట్రంపు ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ పీస్ ఇనిషియేటివ్‌కు ఇండియా ప్రతినిధిగా హాజరైంది.

2022 మహాశివరాత్రి సందర్భంగా శివతాండవ స్తోత్రం వీడియో విడుదల చేసింది ఆమె.. స్వీయగానం.. 15 మిలియన్ల వ్యూస్.. టీసీరీస్ కోసం ఆమె చేసిన మొదటి వీడియో ఫిర్ సే అమితాబ్ బచ్చన్ రిలీజ్ చేశాడు. మూడు రోజుల్లో 1.4 మిలియన్ వ్యూస్.. ఇప్పటికి 5.1 మిలియన్ వ్యూస్ ఆ వీడియోకు.. మహారాష్ట్ర నాలుగు నదుల కోసం ఓ ముంబై రివర్ ఆంథమ్ చేసింది. ఇలా చాలా..

లాన్ టెన్నిస్, ఓపెన్ టెన్నిస్ టోర్నీలకు చీఫ్ పాట్రన్.. ఎప్పుడూ ఏదో ఓ యాక్టివిటీతో మీడియా స్క్రీన్ మీద కనిపిస్తూనే ఉంటుంది. ఫ్యాషన్ డ్రెస్సులు, షోలు.. కేన్స్ ఫిలిమ్ ఫెస్టివల్‌లోనూ మెరిసింది.. ఇలా..

ఓసారి నాగపూర్‌లోనే ఓ కామన్ ఫ్రెండ్ ఇంట్లో కలిశారు దేవేంద్ర ఫడ్నవీస్, అమృత.. కాజువల్ టాక్ కాస్తా 90 నిమిషాలపాటు సాగింది. లవ్వులో పడిపోయారు.. నిజానికి నాకు పొలిటిషియన్స్ మీద నెగెటివ్



ఒపీనియన్ ఉండేది. తనతో మాట్లాడక ఆ అభిప్రాయం మారింది అంటుందామె..

ఫడ్నవీస్ డౌన్ టు ఎర్త్ ఉంటాడు, కానీ పెళ్లికి ముందు, పెళ్లి తరువాత కూడా పెద్ద రొమాంటిక్ కాదు తను.. తన పొలిటికల్ యాక్టివిటీస్ మీదే శ్రద్ధ అని ఏదో ఇంటర్వ్యూలో చెప్పింది. దేశంలోని ఇతర ముఖ్యమంత్రుల భార్యలతో పోలిస్తే ఖచ్చితంగా అమృతది డిఫరెంట్ స్టోరీ.. ఇద్దరివీ వేర్వేరు కెరీర్లు.. ఎవరి విజయాలు వాళ్లవే.. ఎవరి క్రెడిట్స్ వాళ్లవే.. ఫడ్నవీస్ ఎప్పుడూ ఏమీ అడ్డుచెప్పడు. ఇంట్రస్టింగు కపుల్..!!

– ముచ్చట సౌజన్యంతో...

---

తెలుగు సినిమా ఇప్పుడు ఓ కొత్త సమస్యను ఎదుర్కొంటోంది. ఆర్థిక ఒత్తిడిలో అనేక తెలుగు సినిమాలు ఇప్పుడు మునిగి తేలుతున్నాయి అనే దానికన్నా మునిగిపోతున్నాయని చెప్పాలి. ఇప్పటికే పూర్తయిన చాలా సినిమాలు రిలీజ్‌కు నోచుకోవటం లేదు. వాళ్లను వీళ్లను పట్టుకుని, కష్టపడి ఖర్చుపెట్టి థియేటర్స్‌లో రిలీజ్ చేసినా రెవిన్యూ రావటం లేదు. ఓటీటీలు కొనటం లేదు. అన్ని సమస్యలు తెలుగు సినిమాని ఒకేసారి ముంచేస్తున్నాయి. ఈ క్రమంలో తెలుగు సినిమా పరిశ్రమ (టాలీవుడ్) ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది. దీనికి తోడు మట్కా, కంగువ వంటి భారీ బడ్జెట్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద తగిన వసూళ్లు సాధించడంలో విఫలమవడం వల్ల నిర్మాతలు, పెట్టుబడిదారులు పెద్ద ఎత్తున నష్టాలను ఎదుర్కొంటున్నారు. దీని నుంచి బయటపడే అవకాశం లేదా? ఏ సినిమాలకు ప్రస్తుతం ఈ సినిమా వస్తోందో చూద్దాం. గత కొంతకాలంగా భారతీయ సినిమా బిజినెస్ మోడల్‌లో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. కోవిడ్ మహమ్మారి తర్వాత, అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్ వంటి డిజిటల్ దిగ్గజాలు భారతీయ సినిమాలు, ముఖ్యంగా తెలుగు వంటి ప్రాంతీయ సినిమాలపై దృష్టి సారించాయి. అయితే తెలుగులో అనేక సినిమాలు రూపొందుతున్న నేపథ్యంలో, ప్రతి సినిమాను డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు కొనుగోలు చేయడం అసాధ్యంగా మారింది. అందువల్ల, వారు సినిమాలు కొనుక్కునే విషయంలో ఆచితూచి వ్యవహరించడమే కాకుండా, తమ బడ్జెట్‌లను కూడా మార్పు పెంచటం వంటివి చేయలేదు. ఈ పరిస్థితి నిర్మాతలను ఒత్తిడిలోకి నెడుతోంది.





# తెలుగు సినిమాలు ఆగిపోతున్నాయి..!

ట్రేడ్ నుంచి అందుతున్న సమాచారం మేరకు.. కొన్ని తెలుగు సినిమాల చిత్రీకరణలను నిర్మాతలు నిలిపివేశారు. శర్వానంద్ నటిస్తున్న, 'సామజవరగమన' దర్శకుడు రామ్ అబ్బరాజు తెరకెక్కిస్తున్న చిత్రం ఆర్థిక ఒత్తిడుల కారణంగా తాత్కాలికంగా నిలిపివేయబడిందని సమాచారం. ఈ చిత్ర నిర్మాత అనిల్ సుంకర గత సినిమాలలో భారీ నష్టాలను ఎదుర్కొని, రాబోయే షెడ్యూల్‌ల కోసం నిధులను సమీకరించలేకపోతున్నారని సమాచారం. అందువల్ల, ఈ షూటింగ్ వచ్చే ఏడాది ప్రారంభంలో తిరిగి ప్రారంభమవుతుంది. మరోపక్క 14 రీల్స్ ప్లస్ సంస్థ, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా, సాగర్ చంద్ర దర్శకత్వంలో 'టైసన్ నాయుడు' అనే సినిమా నిర్మిస్తోంది. ఈ చిత్రానికి బడ్జెట్ బాగా పెరగడంతో షూట్ తాత్కాలికంగా నిలిపివేయబడింది. ప్రొడక్షన్ హౌస్ ఇప్పుడు 'అఖండ-2' వంటి క్రేజీ చిత్రంపై దృష్టి సారిస్తోంది. ఈ సమయంలో, బెల్లంకొండ కూడా ఇతర సినిమాలతో బిజీగా ఉన్నాడు. 'టైసన్ నాయుడు' షూటింగ్ వచ్చే ఏడాది పునఃప్రారంభమవుతుంది. ఇవే కాకుండా నితిన్ కొత్త సినిమాలు 'రాబిన్‌హుడ్', 'తమ్ముడు' కూడా ఇలాంటి సమస్యలను ఎదుర్కొన్నాయని తెలుస్తోంది. అయితే, ఈ సినిమాలకు మైత్రీ మూవీ మేకర్స్, దిల్ రాజు వంటి ప్రముఖ నిర్మాతలు మద్దతుగా ఉండటంతో, షూటింగ్‌ను పూర్తి చేశారు. ప్రస్తుతం, చిత్రనిర్మాతలు డీల్స్‌ను ముగించేందుకు ఓటీటీ సంస్థలతో చర్చలు జరుపుతున్నారు. ఇలాంటి పరిస్థితి తెలుగులో చాలా సినిమాల్లో కనిపిస్తోంది. దాంతో రాబోయే సినిమాల డ్జెట్‌లను పునర్విమర్శించుకోవాలని, లేదా కొన్ని ప్రాజెక్ట్‌లను నిలిపివేయాలని నిర్మాతలు నిర్ణయించుకుంటున్నారు.

**షెడ్యూల్స్ ఫుల్.. కలెక్షన్స్ నిల్:** ఇదిలా ఉంటే గతంలో సంవత్సరానికి ఒకే ఒక సినిమా చేసే యంగ్ హీరోలు ఇప్పుడు విరామం లేకుండా బ్యాక్-టు-బ్యాక్ సినిమాలు చేస్తున్నారు. ఇది వారికి మంచి రెమ్యునరేషన్ అందించగా, నిర్మాతలు ఆ సినిమాను అమ్ముకోవడంలో విఫలమవుతున్నారు. దాంతో స్టార్లకు అధిక రెమ్యునరేషన్, మిగతా ఖర్చులు సినిమాల పెట్టుబడులు తిరిగి పొందడానికి కష్టంగా మారాయి. అలాగే తాజాగా విడుదలైన భారీ బడ్జెట్ సినిమాలు అనుకున్న స్థాయిలో వసూళ్లు సాధించకపోవడం వల్ల భారీ నష్టాలు వచ్చాయి. ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌ల పెరుగుదల ఓవర్-ది-టాప్ (ఓటీటీ) ప్లాట్‌ఫారమ్‌ల పెరుగుతున్న ఆదరణ ప్రేక్షకుల అభిరుచులను మార్చి థియేటర్ వసూళ్లపై ప్రభావం చూపుతోంది. తెలుగు సినిమా పరిశ్రమ (టాలీవుడ్)పై ఓటీటీ (ఓవర్-ది-టాప్) ప్లాట్‌ఫారమ్‌ల ప్రభావం గణనీయంగా పెరుగుతోంది. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, డిస్నీ హాట్‌స్టార్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు ప్రేక్షకుల ఆలోచనలను మార్చాయి. ఈ ప్రభావం పలు అంశాలలో కనిపిస్తోంది.





### థియేటర్ ఆదాయంపై తగ్గుదల:

జనాల్లో ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లలో వచ్చే కొత్త సినిమా విడుదలలను చూసే అభిరుచి పెరుగుతోంది. థియేటర్‌కు వెళ్లకుండా ఇంట్లోనే సినిమాలను, వెబ్‌సిరీస్‌లను వీక్షించేందుకు ప్రేక్షకులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. అలాగే డిజిటల్ హక్కుల ద్వారా ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లు నిర్మాతలకు స్థిరమైన ఆదాయం అందిస్తున్నాయి. కొన్ని సినిమాలు నేరుగా ఓటీటీ కోసం రూపొందించడం సాధారణంగా మారింది.

### మారాల్సిన కథా ప్రక్రియ :

ఓటీటీల ప్రభావంతో కథలు మరింత రియలిస్టిక్‌గా, బోల్డ్‌గా ఉండేలా రూపొందించాల్సిన సిట్యువేషన్ క్రియేట్ అయ్యింది. ఎందుకంటే ఓటీటీ ప్రేక్షకులు కొత్తదనాన్ని ఆశిస్తున్నారు. ట్రెండింగ్ వెబ్‌సిరీస్‌లు, విభిన్నమైన కథలతో టాలీవుడ్ ప్రయోగాలు ప్రారంభించింది. అంతర్జాతీయ కంటెంట్ సులభంగా అందుబాటులో ఉండడం వల్ల తెలుగు ప్రేక్షకుల అభిరుచి విస్తృతమైంది. ఇది స్థానిక కథా కథనాలను కూడా నాణ్యతతో పాటు సృజనాత్మకంగా ఉండేలా ప్రేరేపిస్తోంది. ఇవి చాలదన్నట్లు ఓటీటీ ద్వారా బాలీవుడ్, హాలీవుడ్ చిత్రాలు ప్రత్యక్ష పోటీగా మారాయి. ఈ ప్రభావం తెలుగు చిత్రాలను అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా మార్చింది. తెలుగు పరిశ్రమ బాలీవుడ్, హాలీవుడ్ వంటి ఇతర పరిశ్రమల నుంచి తీవ్రమైన పోటీని ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో తెలుగు సినిమా పరిశ్రమ ప్రస్తుతం కఠిన పరిస్థితులను ఎదుర్కొంటోంది. కానీ వ్యూహాత్మక ప్రణాళిక, వినూత్న కథా రచన, అనుకూలతతో ఈ ఆర్థిక ఒత్తిడిని అధిగమించి, అభివృద్ధి చెందే అవకాశం ఉంది. థియేటర్లు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు కలసికట్టుగా పని చేయడం తెలుగు సినిమా భవిష్యత్తుకు ముఖ్యమని చెప్పవచ్చు.

– సూర్యప్రకాశ్ జోశ్యుల

# అంగరంగ వైభవంగా కొరికాన ప్రమాణస్వీకారం

- తరలివచ్చిన కూటమి నాయకులు
- నగరంలో జనసైనికుల భారీ ర్యాలీ
- సుడాను అభివృద్ధి పథంలో నడిపిస్తానని రవికుమార్ భరోసా



(సత్యంనూస్, శ్రీకాకుళం)

అంగరంగ వైభవంగా, జనసైనికులు, వీరమహిళలు కూటమి పార్టీల నాయకుల సమక్షంలో శ్రీకాకుళం పట్టణ అభివృద్ధి సంస్థ (సుడా) ఛైర్మన్‌గా జనసైనికుడు కొరికాన రవికుమార్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. నగరంలోని 80అడుగుల రోడ్డులో ఉన్న ఆనందమయి ఫంక్షన్ హాల్ వద్ద జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ అధ్యక్షతన నిర్వహించిన ప్రమాణస్వీకార కార్యక్రమానికి టీడీపీ ఎమ్మెల్యేలు గొండు శంకర్, మామిడి గోవిందరావు, నిమ్మక జయకృష్ణ, పార్టీ జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ, మాజీ డీసీసీబీ అధ్యక్షులు డోలజగన్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. అంతకుముందు విశాఖపట్నం నుంచి కార్లతో ర్యాలీగా వచ్చిన కొరికాన రవికుమార్, అయన భార్య భవానికి జనసైనికులు పైడిభీమవరం వద్ద ఘనస్వాగతం పలికి గజమాలలతో సత్కరించారు. ఎచ్చెర్ల చేరుకున్న ఆయనకు బీజేపీ ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అక్కడనుంచి శ్రీకాకుళం సింహద్వారం వద్దకు చేరుకున్న కొరికాన దంపతులకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన జనసైనికులు నగరానికి చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి గజమాలతో సన్మానించారు. జనసేన అభిమానులు, వీర మహిళలు పూలమాలలు వేసి హారతులు పట్టి నుదుటన తిలకాల దిద్దారు. అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా డేఅండ్ నైట్, ఏడురోడ్లు కూడలి, పొట్టిశ్రీరాముల జంక్షన్ మీదుగా మిల్లు జంక్షన్‌కు చేరుకొని అక్కడ నుంచి అనందమయి పంక్షన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన సభా వేదిక వద్దకు చేరుకున్నారు. జనసైనికులు కేరింతల మధ్య కొరికాన రవికుమార్ ఛైర్మన్‌గా సుడా కార్యదర్శి ఎం.విజయలక్ష్మి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ సుడా ఛైర్మన్‌గా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సుడా ద్వారా అత్యంత పారదర్శకమైన సేవలు అందించేలా తీర్చి దిద్దుతానన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, జిల్లా ప్రజా ప్రతినిధుల సహాయ సహకారాలతో సుడాను అభివృద్ధిపథంలో నడుపుతానన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తానన్నారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పవన్‌కళ్యాణ్ వద్ద నేర్చుకున్న క్రమశిక్షణతో పనిచేసి వెనుకబడిన సిక్కోలు జిల్లాను అభివృద్ధిపథంలో నడిపిస్తానని తెలిపారు. భవిష్యత్తుతరాలకు ఉపయోగపడేలా శ్రీకాకుళం నగరాన్ని తీర్చిదిద్దాతానన్నారు. సుడాలో అవినీతి రహిత పాలనకు అవకాశం ఇవ్వనన్నారు. స్థానిక శాసనసభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ ధృడసంకల్పం, కార్యదీక్ష, పట్టుదలకు నిదర్శనం రవికుమారేనన్నారు. పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేసే వారికి తప్పకుండా పదవులు లభిస్తాయనడానికి కొరికాన ఒక ఉదాహరణ అని తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో సుడా అభివృద్ధికి తమవంతు



సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సుడా తరపున శ్రీకాకుళం జిల్లాలో లేఅవుట్లు వేయాలని కోరారు. సుడాను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. ప్రమాణస్వీకారం సందర్భంగా సుడా ఛైర్మన్‌కు అభినందనలు తెలిపారు. పాలకొండ జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ సుడా ఛైర్మన్ కొరిగాన రవికుమార్‌పై సుడాను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు ఉంచారన్నారు. గ్రామాల అభివృద్ధి, సంక్షేమం అన్ని సమానంగా అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని సుడా ఛైర్మన్‌ను కోరారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నతపదవులు అధిరోహించాలన్నారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేసి శ్రీకాకుళంను అభివృద్ధిపథంలో నడిపించాలని కోరారు. అందుకు కూటమి ప్రజాప్రతినిధులు పూర్తి సహాకారం అందిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో పుట్టినప్పటికీ క్రమశిక్షణతో అంచెలంచెలుగా ఎదిగి సుడా ఛైర్మన్‌గా నియమితులు కావడం అభినందనీయమన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కూటమి పార్టీల నాయకులందరికీ ప్రాధాన్యత క్రమంలో పదవులు దక్కుతున్నాయని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఒక ప్రణాళికా పరంగా నాయకుల పనితీరును నిష్ఠంగా పరిశీలించి వారికి సరైన ప్రాధాన్యత కల్పిస్తున్నారు అనడానికి సుడా ఛైర్మన్‌గా రవికుమార్‌ను నియమించడమే నిదర్శనమని పేర్కొన్నారు. పాతపట్నం, పాలకొండ ఎమ్మెల్యేల గెలుపునకు రవికుమార్ ఎంతో సహకరించారని పేర్కొన్నారు. శ్రీకాకుళం కార్పొరేషన్‌లో పలాస మాదిరిగా లే అవుట్లు వేసి సూడా ఆదాయాన్ని పెంచాలని ఆకాంక్షించారు. సుడాను విజయపథంలో నడిపించాలని, శాఖ నుండి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేయాలని కోరుతూ అభినందనలు తెలిపారు. పాతపట్నం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ గేదెల చైతన్య, పలాస ఇన్‌చార్జ్ దుర్గారావు, ఎచ్చెర్ల ఇన్‌చార్జ్ విశ్వక్సేన్, ఆమదాలవలస ఇన్‌చార్జ్ పి.రామ్మోహన్, ఇచ్ఛాపురం ఇన్‌చార్జ్ దాసరి రాజు, నరసన్నపేట ఇన్‌చార్జ్ బలగ ప్రవీణ్, బీజేపీ జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, టీడీపీ నాయకులు మెండ దాసునాయుడు, మార్క్‌ఫెడ్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆనెపు రామకృష్ణ, బలివాడ మల్లేశ్వరరావు, టీడీపీ నగర అధ్యక్షులు



మాదారపు వెంకటేష్, శవ్వాన ఉమామహేశ్వరి, సురంగి మోహన రావు, పొగిరి సురేష్‌బాబు, జనసేన పార్టీ వీర మహిళలు మోహన్ లక్ష్మీ, లలిత, రవీంద్ర, కొండా ఉదయ్ కుమార్, గురుప్రసాద్, శ్రీకాకుళం పట్టణ నాయకులు వాడవలస సురేష్ కుమార్, కళింగ కార్పొరేషన్ సభ్యులు రవి బాబ్జీ, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, సుడా ఎపిఓ కృష్ణ, ఇతర ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వస్త్రాన్నదానం “మహాదానం”



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అన్నిదానాల్లో అన్నదానం, వస్త్ర దానం మిన్నని లైన్స్ క్లబ్ సెంట్రల్ మెంటర్ నటుకుల మోహన్ అన్నారు. వస్త్రాన్నదానంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ నగరపాలక సంస్థ శ్రీకాకుళం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) వారి నిధులతో నడవబడుతున్న పట్టణ నిరాశ్రయుల వసతిగృహంలో ఉంటున్న నిరుపేదల ఆకలి తీర్చిటంలో నేను భాగమైనందుకు ఆనందంగా ఉందని, ఇక్కడ నివాసముంటున్న అభాగ్యుల కోసం క్రిందటి వారం లైన్స్‌క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు డా.బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించామని గుర్తుచేశారు. ఎమెర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నంది ఉమాశంకర్ ఆధ్వర్యంలో ఇక్కడ వుండే పిల్లలకు, వృద్దులకు అల్పాహారంతో పాటు వస్త్రదానం, ఫలదానం చేసి అందరిలో స్ఫూర్తినింపటం గొప్పవిషయమని, గతనాలుగు సంవత్సరాలుగా ఇక్కడ సరైనవసతులు లేక ఇక్కడ వుండేవారు ఇబ్బంది పడుతున్నారన్నారు. బొట్టా సాయి మాట్లాడుతూ మానవసేవే మాధసేవని, ఇక్కడ నివాసముంటున్న గదులలో ఫ్యాన్‌లు పాడైపోయాయని, నీళ్ల పైపులు సైతం మొన్న కురిసిన వానలకు ఇరిగిపోయావని, సంబంధిత అధికారులు పట్టించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సెంట్రల్ మార్కెటింగ్ చైర్‌పర్సన్ ఉర్లం శివతేజ, జోగి రాజు, పొడుగు చరణ్, పొడుగు అవినాష్‌లు పాల్గొన్నారు.



డాక్టర్. బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి 68వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక కోర్టు కూడలి అంబేద్కర్ విగ్రహానికి మాలమహానాడు పాతపట్నం మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తొగిరి లక్ష్మినారాయణ, నవగాన రత్నకుమార్‌లు శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి శిర్ల జోగారావు, మాలమహానాడు గౌరవ సలహాదారులు శిర్ల ప్రభాకరరావు యజ్ఞల భాస్కరరావు, మహేంద్ర విద్యాసంస్థలు డైరక్టర్ శాసనపురి మధుబాబు, రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పారశెల్లి రామరాజు, మాల మహానాడు న్యాయ సలహాదారు మెట్ట రామారావు (అడ్వకేట్), దళిత నాయకులు గుండాల వెంకటరమణ, శిర్ల జనార్ధనరావు, బేరి, ధర్మారావు కాలేజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, పాతపట్నం

## అన్ని దానాలకన్నా రక్తదానం మిన్న

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రక్తదానం ఒక మహత్తరమైన కార్యక్రమమని, ఇది ప్రతీఒక్కరి సామాజిక బాధ్యతని ప్రముఖవైద్యులు మూల వెంకటరావు అన్నారు. స్థానిక పాలకొండ రోడ్‌లో గల హెచ్‌డీఎఫ్‌సీ కార్యాలయంలో 16వ అఖిల భారత బ్లడ్ డొనేషన్ డ్రైవ్ శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ వైద్యులు మూల వెంకటరావు, బ్రాంచ్ మేనేజర్ ఏ.శేఖర్, యూనిట్ హెడ్ జివి.శశిధర్ (డబ్ల్యుబిఓ), మేనేజర్ బరాటం రవిశంకర్, రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్యలు ప్రారంభించినంతరం మేనేజర్ ఎ.శేఖర్ మాట్లాడుతూహెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, తన ఫ్లాగ్లిప్ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమం పరివర్తన్‌లో భాగంగా దేశవ్యాప్త రక్తదాన శిబిరాల నిర్వహణ 16వ ఎడిషను భారతదేశంలోని 1100 నగరాల్లో నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చెయ్యాలని, ఈ రోజుహెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఉద్యోగులు, వినియోగదారులు, కార్పొరేట్లు, రక్షణ దళాల సభ్యులు, విద్యార్థులు, సాధారణ పౌరులు పాల్గొనటం హర్షణీయమన్నారు. సమాజ సంక్షేమానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కీలక పాత్ర పోషించటం ఆనందదాయకన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ అనుదీప్, ఎస్.ఉమా మహేష్, ఉర్లం శివతేజ, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ డి.ఆదిలింగం, రెడ్‌క్రాస్ ప్రతినిధి, బ్లడ్ బ్యాంకు సిబ్బంది నంది ఉమాశంకర్, జి.హర్షవర్ధన్, జగదీశ్, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాంగ రూపశిల్పికి వైకాపా నివాళి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భారత రాజ్యాంగ రూపశిల్పి, బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా వైకాపా నాయకులు శుక్రవారం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈమేరకు జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మానికి కృష్ణదాసు, మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు, ఇతర వైకాపా నాయకులు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ వైకాపా బడుగు బలహీన వర్గాల పార్టీ అని, రాజ్యాంగ నిర్మాతకు క్రమంం తప్పకుండా నివాళులర్పిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ కేంద్రబింధువైన విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ స్మృతివనంతోపాటు విగ్రహావిష్కరణ చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిదన్నారు. ఆ మహనీయునీ ఆశయాలు నెరవేర్చడంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పరిపాలనలో 100% నిరూపించుకున్నారన్నారు. పొన్నాడ రుషి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, గేదెల పురుషోత్తము, సాధు వైకుంఠరావు గొద్దు కృష్ణ, బుక్కురు ఉమామహేశ్వరరావు ఎచ్చెర్ల శ్రీధర్, అంబటి శ్రీను, యజ్జల గురుమూర్తి, చింతల గడ్డయ్య, కొమ్ము జావాది శ్రీనివాసరావు, గురువులు,శ్యామ్, జలగడుగులు శ్రీను, అర్జీ ఈశ్వరరావు, రౌతు శంకర్రావు గుడ్ల దామోదర్, బగ్గు అప్పారావు, అల్లు రమణ, అంధవరపు నాగేశ్వరరావు, డాక్టర్ శ్రీనివాస పట్నాయక్‌తోపాటు కార్యక్రమానికి జిల్లాలో ఉన్న అంబేద్కర్ వాదులు ప్రజాస్వామ్యవాదులు, దళిత,బహుజనులు. హాజరయ్యారు.



ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందజేయాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి బుర్రి కుమార రాజాకి రాష్ట్ర కోశాధికారి బబ్బురు గణేష్‌బాబు వినతిపత్రం అందజేశారు. జీతాలు,పెన్షన్‌లు ఇవ్వాలంటే అదనపు గ్రాంట్ ఇస్తేనే అవుతుంది అని ప్రజల నుండి వసూలు చేస్తున్న సెస్ బకాయిలు వసూలు చేస్తేనే గానీ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-1 గ్రంధాలయ అధికారి వి.వి.జి. శంకరరావు కూడా వున్నారు. – సత్యంన్యూస్, శ్రీకాకుళం.



అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక ఆదిఆంధ్రవీధిలో అంబేద్కర్ విగ్రహానికి కొల్లి ఎల్లయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, కొల్లి యల్లయ్య, గ్రామపెద్దలు యర్ర వెంకట్రావు, దాసరి వైకుంతరావు, పినిమింటి రామారావు, యర్ర గురుమూర్తి, యర్ర కొండలరావు యువత, కార్మికులు పాల్గొన్నారు. – సత్యంన్యూస్, టెక్కలి

## పట్టణంలో ట్రాఫిక్ రద్దీపై ఆరా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం పట్టణంలో గల ట్రాఫిక్ రద్దీ, సమస్యలపై జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి గురువారం ఆరా తీశారు. ఈ సందర్భంగా టూటౌన్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పట్టణ పరిధిలో నలువైపులా విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులకు సూచించారు. గురువారం సాయంత్రం జిల్లా ఎస్పీ శ్రీకాకుళం పట్టణంలోని డే అండ్ నైట్,రామలక్షణ, ఏడు రోడ్లు, అరసవల్లి మిల్లు జంక్షన్‌తో పాటు, శ్రీకాకుళం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ సాయంత్రం పూట శ్రీకాకుళం పట్టణంలో గల ట్రాఫిక్ సమస్యలు,ట్రాఫిక్ రద్దీపై ఆరా తీశారు. ఇందులో భాగంగా పోలీస్ అధికారులు సిబ్బంది నిర్వహిస్తున్న వాహన తనిఖీల సరళిని పరిశీలించి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టి మద్యం సేవించే వాహనాలను నడిపే వారిని, మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ లేని వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని సూచించారు. రోడ్డు భద్రత ,ట్రాఫిక్ నియమాలు పాటించిన వారిపై చట్టపరమైన జరిమానాలు విధించి ప్రమాదం నివారణ చర్యలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులు ను ఆదేశించారు. అదే విధంగా జిల్లా ఎస్పీ శ్రీకాకుళం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది పనితీరు వివరాలపై ఆరా తీసి,పలు ముఖ్యమైన రికార్డులు నిర్వహణ క్షుణ్ణంగా పరిశీలించి, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఎస్పీతోపాటు రూరల్ సర్కిల్ సీఐ పైడిపు నాయడు, ట్రాఫిక్ సిఐ నాగరాజు,ఎస్సైలు హరికృష్ణ, సంతోష్‌లున్నారు.




ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001

# అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

## ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి

## ఘనంగా హోంగార్డు ఆవిర్భావ దినోత్సవం



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

అప్పగించిన విధులు నీతినిజాయితీతో, బాధ్యత, అంకితభావంతో నిర్వర్తించి, మెరుగైన సేవలు ప్రజలకు అందించాలని ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎచ్చెర్ల జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో నిర్వహించిన 62వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పరేడ్ కమాండర్ హోంగార్డ్ శశిభూషణ్ ఎస్పీకి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పరేడ్ కమాండర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైజింగ్ డే పరేడ్‌ను ఎస్పీ తిలకించారు. పరేడ్ కమాండర్, ప్లేటెన్లు కమాండర్, సిబ్బందికి ఎస్పీ మెడల్స్ వేసి సత్కరించారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన హోంగార్డు అప్పలనాయుడు భార్య పి.భారతికి జిల్లా వ్యాప్తంగా ఉన్న హోంగార్డు విభాగం ఒక రోజు వేతనం రూ.4.50లక్షలు ఆర్థిక సహాయాన్ని ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 1962లో కొద్దిమందితో స్వచ్ఛంద సంస్థగా ఏర్పడిన హోంగార్డ్ ఆర్గనైజేషన్ నేడు జిల్లాలో 751 మంది మహిళా, పురుష హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. జిల్లాలో హోంగార్డులు శాంతిభద్రతల పరిరక్షణలోను, పకృతి వైపరీత్యాలలోను, వీఐపీల బందోబస్తు విధుల్లోను సమయపాలనతో విధులు నిర్వర్తించి మన్నలను పొందుతున్నారని కొనియాడారు. పోలీస్ శాఖలో హోంగార్డు విభాగం చాలా కీలకమని, వారి సంక్షేమానికి అధిక ప్రాధాన్యతిస్తూ జిల్లాలో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

అనంతరం 35 సంవత్సరాల సర్వీస్ కాలం పూర్తి చేసుకున్న కృష్ణవేణి, రాజు, కృష్ణమ్మ, విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అనురాధ, విశాలాక్షిలతో పాటు పలువురు హోంగార్డులను ఎస్పీ జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన రేవతి అనే హోంగార్డు వైద్య ఖర్చులకు ప్రత్యేక చొరవ చూపించి ఖరీదైన వైద్యాన్ని అందించి ఆమె ప్రాణాలను కాపాడినందుకు జిల్లా హోంగార్డు ఆర్గనైజేషన్ తరఫున ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు వివేకానంద, శేషాద్రి, ప్రసాదరావు, సీఐలు ఇమ్మాన్యువల్ రాజు, అవతారం, ఆర్ఐ నర్సింగరావు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, హోంగార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

# డబ్బులు కట్టి దెబ్బలు తింటున్నారు

సొంగ మనోజ్ కుమాRRR (O positive blood gr...
@Manu_SMK

అన్నయ్య మీరు .@naralokesh చాలా సీరియస్ గా యాక్షన్ తీసుకోవాల్సిన ఇష్యూ ఇది

శ్రీకాకుళం జిల్లా ఐ ఎ సి (ఇండియన్ ఆర్మీ కాలింగ్) సంస్థకి ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ బసవ రమణ అనే వ్యక్తి ఆధ్వర్యంలో కొన్ని వేలాదిమంది స్టూడెంట్స్ జీవితాలతో ఆడుకుంటున్నాడు. ఆర్మీలో నేవీలో ఎయిర్ ఫోర్సులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ విద్యార్థుల దగ్గర ఐదు నుంచి పది లక్షల వరకు వసూళ్లు

Translate post



లోకేష్‌కు పెట్టిన ట్వీట్

(మొదటిపేజీ తరువాయి)

సైనికుడ్ని తయారుచేయాలంటే ఆ ఉపాధ్యాయుడికో, లేదా అంటే ఆ సంస్థ వ్యవస్థాపకుడికో మరెంత దృఢమైన మానసిక స్థితి ఉండాలి? సరిగ్గా ఇండియన్ ఆర్మీ కాలింగ్ వ్యవస్థాపకుడు బీవీ రమణకు ఇదే లోపించిందని ప్రస్తుతం హల్‌చల్ చేస్తున్న వీడియోలు చూస్తే అర్థమవుతుంది. ఒక విద్యార్థిని గొడ్డుకంటే దారుణంగా కొడుతున్న ఆ దృశ్యాలు చూస్తే ఎవరికైనా ఇదే అభిప్రాయం కలుగుతుంది. అందుకే ఇటీవల ఇంత స్థాయిలో ట్రోలైన వీడియో మరొకటి కనిపించలేదు. కారణాలేమైనా కావచ్చు. కానీ, పశువులను దండించడానికి కూడా అంతలా ఎవరూ పూనుకోరని మాత్రం అర్థమవుతుంది. ఇప్పటికే ఇండియన్ ఆర్మీ కాలింగ్ వ్యవస్థాపకుడి మీద అనేక ఆరోపణలు వచ్చాయి. వీటన్నింటినీ ఒకే ఒక్క కారణంతో ఆయన తోసిపుచ్చుకుంటూవచ్చారు. రాష్ట్రంలో ఆర్మీలో ఉద్యోగాల కోసం శిక్షణ ఇవ్వడానికి అనేక సంస్థలు ఉన్నాయని, ఈ పేరుతో వారంతా కోట్లు సంపాదిస్తున్నారని, ఇక్కడ తాను సొమ్ములు తీసుకోకుండా కేవలం తన జిల్లా విద్యార్థులకు తీర్చిదిద్దడానికి వచ్చానని, కార్పొరేట్ కుట్రలో భాగంగా తనను బలి చేస్తున్నారని బీవీ రమణ నమ్మబలుకుతూ నెట్టుకొస్తున్నాడు. కానీ వైరల్ అవుతున్న వీడియోలు చూస్తే ఇటువంటి మానసిక స్థితి ఉన్న గురువు ఎట్టి పరిస్థితుల్లోనూ దేశరక్షణకు అవసరమైన సైనికులను తయారుచేయలేడని అర్థమవుతుంది.



బీవీ రమణ చేతిలో దెబ్బలుతిన్న నవీన్‌తో పాటు మిగిలిన నలుగురు

బీవీ రమణ తన హాస్టల్‌లో ఒక విద్యార్థిని చావ చితక్కొట్టాడు. ఇచ్ఛాపురానికి చెందిన సాడి నవీన్ అనే యువకుడిని యూఎస్‌బీ కేబుల్‌తో ఒళ్లు చీరేశాడు. వాస్తవానికి ఈ వీడియో నిన్న మొన్నటిది కాదు.. 2023 డిసెంబరు 28 తర్వాత జరిగిన ఘటనకు సంబంధించినవి. ఇప్పుడు అవి ఎందుకు బయటకు వచ్చాయో, ఎలా వచ్చాయో తెలియదు కానీ ఆ వీడియోలో సాడి నవీన్‌ను గొడ్డును బాదినట్టు బాదడమే కాకుండా నవీన్ కుటుంబంలో మహిళలను కూడా చెప్పలేని బూతులు తిట్టడాన్ని వీడియోలో అందరూ గమనించారు. నిజంగా సాడి నవీన్‌తో పాటు మరో నలుగుర్ని కూడా ఇదే కేబుల్‌తో చితకబాదినట్లు వీడియో చూస్తే అర్థమవుతుంది. వీరందర్నీ ఒంగోబెట్టిన దృశ్యాలు కూడా కనిపిస్తున్నాయి. 2023 డిసెంబరు 28న నగరంలో ఓ వస్త్రదుకాణం ప్రారంభోత్సవానికి వీఐపీలు రావడంతో సెక్యూరిటీ కోసం ఇండియన్ ఆర్మీకాలింగ్‌లో ఉన్న విద్యార్థులను బీవీ రమణ అక్కడకు పంపారు. ఆ తర్వాత షాపింగ్‌మాల్‌లో కొన్ని వస్త్రాలు ఇండియన్ ఆర్మీ కాలింగ్ విద్యార్థులు కొందరు దొంగిలించారని వస్త్రదుకాణం మేనేజ్‌మెంట్ ఫిర్యాదు చేయడంతోనే వీరిని కొట్టారన్న వాదన ఒకటి ప్రచారమవుతోంది. వీడియోలు ట్రోల్ అయిన తర్వాత 'సత్యం' సంబంధిత హాస్టల్‌కు వెళ్లి విచారించగా, దెబ్బలు తిన్న విద్యార్థులు తప్పు తమదేనని, ఔటింగ్‌కు చెప్పకుండా వెళ్లిపోవడంతో బీవీ రమణ తమను కొట్టారని, తండ్రయితే కొట్టరా అని చెప్పుకొచ్చారు. మరి మీ ఇంటిలో మహిళలను ఎందుకు బూతులు తిట్టారంటే.. తండ్రయితే తిట్టరా అని కూడా సమర్థించుకున్నారు. బయట జరుగుతున్న ప్రచారం నిజమైనదా? విద్యార్థులు చెబుతున్న కథే వాస్తవమా? అన్నది పక్కన పెడితే.. బీవీ రమణ కొట్టిన తీరు, భాష సభ్యసమాజంలో కచ్చితంగా అభ్యంతరకరం.




ఇండియన్ ఆర్మీకాలింగ్ క్యాంపస్‌లో ప్రతీది గోప్యమే. ఎందుకంటే.. ఇక్కడ ప్రతీ పోస్టులోనూ బీవీ రమణ మనుషులే ఉన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, డ్రైవర్, వార్డెన్లు.. ఇలా అందరూ బీవీ రమణ మనుషులే. చివరకు 2018లో ఇండియన్ ఆర్మీ కాలింగ్ బోర్డు పెట్టిన తర్వాత గానీ, 2023లో ఇందుకు అనుమతులు వచ్చిన తర్వాత గానీ ఉద్యోగాలు రాని విద్యార్థుల్లో కొందరు ఇక్కడ ఉద్యోగులుగా మారిపోయారు. వారికి జీతాలు, బత్తాలు ఉన్నాయో లేవో కూడా బయటకు చెప్పుకోలేకపోతున్నారు. కొందరు ఇక్కడ వాతావరణం చూసి చెప్పాపెట్టకుండా పారిపోతున్నారు. మొన్నటికి మొన్న అమ్మాయిలుండే హాస్టల్‌లో ఉండకూడని చోట సీసీ కెమెరాలు ఉన్నాయని ఆరోపణలు వస్తే విచారణకు వెళ్లిన పోలీసులకు తామే కెమెరాలు పెట్టమన్నామంటూ అమ్మాయిలు చెప్పుకురావడం కొసమెరుపు.

వాస్తవానికి ఇండియన్ ఆర్మీకాలింగ్ అనేది నాన్ ప్రాఫిటబుల్ ఎన్జీవో సంస్థగా ఆవిర్భవించింది. కానీ ఇందులో రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇది పెద్ద విషయం కాకపోయినప్పటికీ ఇండియన్ ఆర్మీ కాలింగ్ పేరిట ఇంటర్మీడియట్ కళాశాలకు ఎటువంటి రికగ్నైజేషనూ లేదు. నగరంలో ఎన్ఆర్ఐ కాలేజ్‌తో టైఅప్ పెట్టుకొని ఇంటర్మీడియట్ పాఠాలు చెబుతున్నారు. ఈ విషయం విద్యాశాఖాధికారులందరికీ తెలుసు. నగరంలో ఇండియన్ ఆర్మీ కాలింగ్‌కు పెద్ద ఎత్తున పబ్లిసిటీ రావడంతో కొంతమంది పోలీస్ అధికారులు కూడా ఇందులో పెట్టుబడులు పెట్టినట్టు తెలుస్తుంది. రూ.10 లక్షలు పెట్టి బీవీ రమణ నిర్వాకాలు తెలిసి వెనక్కు తగ్గిన ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్‌కు కూడా బీవీ రమణ మొత్తం సొమ్ములు వెనక్కు ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయి. శ్రీకాకుళం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న తల్లిదండ్రులకు ఎరవేసి అక్కడ్నుంచి విద్యార్థులను పెద్ద ఎత్తున తెచ్చుకుంటున్నారు.

- **ఆర్మీలో పనిచేసిన రమణ మెంటల్ కండిషన్ సరిగా లేదనే కారణంతోనే విధుల నుంచి తొలగించి పంపేశారనే ప్రచారం కూడా ఉంది. ప్రస్తుతం ట్రోల్ అవుతున్న వీడియోలు చూస్తుంటే ఆయన మెంటల్ కండిషన్ ఇట్టే తెలిసిపోతుంది.**
- **జిల్లాలో పాఠశాలల నుంచి ఇండియన్ ఆర్మీ కాలింగ్ క్లాసులకు వెళ్లొచ్చని గతంలో ఓ సర్క్యులర్ ఉండేది. డీఈవో తిరుమల చైతన్య బీవీ రమణ నిర్వాకాలు చూసి ఈ సర్క్యులర్‌ను ఇటీవలే రద్దు చేశారు.**
- **కొద్ది కాలం క్రితం ఇండియన్ ఆర్మీ కాలింగ్ కోసం ప్రభుత్వం స్థలం కేటాయించాలంటూ 50 సెంట్ల స్థలం కోసం దరఖాస్తు చేసుకోగా, దాన్ని కలెక్టరేట్‌లో ఇప్పుడు పక్కన పడేశారు.**
- **తమ పిల్లలు దేశసేవకు వెళ్తారని డబ్బులు కడితే, ఇక్కడ వారు దొంగలుగానో, లేదా అంటే దెబ్బలు తిన్నవారిగానో మిగిలిపోతున్న విషయం పేరెంట్స్‌కు తెలియడంలేదు.**

# నిజమే..! బడి పంతుళ్లు బతకలేకపోతున్నారు

(మొదటిపేజీ తరువాయి)

ఆసక్తి చూపరని తెలిసింది. ఒకప్పుడు స్కూల్ నుంచో కాలేజ్ నుంచో ఒక పిలుపు వస్తే ఎక్కడ పని అక్కడ వదిలేసి తల్లో తండ్రో పరిగెత్తి వెళ్లి స్కూల్ పెద్దని కలిసేవారు. ఇప్పుడు అలా కాదు. పేరెంట్స్ మీట్‌కు రారు సరే మీ అమ్మాయి లేదా అబ్బాయి కోసం మాట్లాడాలి అంటే మాకు తీరిక లేదు అన్న సమాధానం వస్తుంది. ఎవరి కోసం పొద్దున్న నుంచి సాయంత్రం వరకు కష్టపడుతున్నారో వారే పక్కతోవ పడుతుంటే ఎవరి కోసం ఈ సంపాదన అన్న స్పృహ లేకపోతే ఎలా..? జనతా గారేజ్ సినిమాలో జూనియర్ ఎన్టీఆర్ ఒక మాట చెప్తాడు. నీ కొడుకు సరైనోడు అయి వృద్ధిలోకి వస్తే నీ ఆస్తి వైపు కన్నెత్తి చూడడు. అదే వాడు దారితప్పితే ఏడాది తిరిగేలోపు నీ ఆస్తిని కర్పూరంలా తగలెట్టేస్తాడు. ఇక్కడే ఒక విషయం చెప్పాలి. చాలా కాలేజీల్లో ఇప్పుడు కొత్త విధానం మొదలయ్యింది. పిల్లల చెడు అలవాట్లు తల్లిదండ్రులకు చెప్పరు. మనం ప్రతి విషయం తల్లిదండ్రులకి చెప్పకూడదు సార్. ఈ రెండేళ్లలో పెద్ద గొప్ప తప్పు ఏం జరిగిపోదు. మనం చెప్పినా.. నా కొడుకు/కూతురు బంగారం.. మీ కాలేజీలో చేర్చాక ఇలా తయారయ్యారంటారు. ఎందుకొచ్చిన తలనొప్పి. ఇది ఒక కార్పొరేట్ కాలేజ్ ప్రిన్సిపాల్ స్వయంగా నాతో చెప్పిన మాట.

మరోవైపు ఈ దేశానికి డాక్టర్ల కొరత లేదు, ఇంజనీర్ల కొరత లేదు కానీ ఒక మంచి టీచర్ అని చెప్పబడేవారు వేళ్లపై లెక్కించవచ్చు. ఇదిలా ఉంటే మరోవైపు ఈ మధ్య నిరంతరం కనబడుతున్న వార్త ఫలానా స్కూల్లో కీచక ఉపాధ్యాయుడు అని, ఏ వృత్తిలో ఈ తప్పు చేసిన అది కీచక పనే కానీ కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే పెడుతున్న టైటిల్ ఇది. కంటిరెప్పలా కాపాడాల్సిన టీచర్ ఈ దుర్మార్గానికి పాల్పడడం దారుణమైన మనస్తత్వాలను ప్రతిబింబిస్తుంది.

అన్నమయ్య జిల్లా రాయచోటిలోని కొత్తపల్లి ఉర్దూ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏజాష్ అహ్మద్ టీచర్‌గా పని చేస్తున్నారు. బుధవారం విద్యార్థులకు ఆయన పాఠాలు చెప్తూ ఉన్నారు. పక్కనే తొమ్మిదో తరగతి నుంచి విపరీతమై అల్లరి వినిపిస్తోంది. ఆయన ఆ తరగతికి వెళ్లి వాళ్లని మందలించాడు. వారిలో ఇద్దరు కవల పిల్లలున్నారు. వాళ్లిద్దరూ బాగా అల్లరి చేస్తున్నారని గుర్తించి వారిలో ఒకరిపై దెబ్బ వేశారు. అదే తన ప్రాణం తీస్తుందని ఆయన ఊహించలేదు. దెబ్బ పడ్డ వెంటనే ఆ విద్యార్థి, అతని సోదరుడు ఆయనపై తిరగబడ్డారు. మరో విద్యార్థి సైతం వారికి తోడయ్యారు. ముగ్గురూ కలిసి అహ్మద్‌పై దాడి చేశారు. ఆ కవలల్లో ఒకరి వద్ద కడియం ఉంది. దాంతో ఆయన ఎడమ కన్ను మీద కొట్టాడు. ఆయనకు గాయం కావడంతో పాటు కళ్లజోడు పగిలిపోయింది. ఉపాధ్యాయుడు.. అందరికీ పాఠాలు చెప్పే మనిషి. చుట్టూ పిల్లల మధ్యే తనపై దాడి జరిగితే తట్టుకోగలడా? నొప్పి కన్నా ఎక్కువగా అవమానం ఆయన్ని బాధించింది. అప్పటికే తోటి ఉపాధ్యాయులు వచ్చి పరిస్థితిని సద్దుమణిగేలా చేశారు. ఆ విద్యార్థులతో ఆయనకు క్షమాపణ చెప్పించే ప్రయత్నం చేశారు. కానీ అహ్మద్ దాన్ని తిరస్కరించారు. 'సారీ' అనే రెండక్షరాల పదం తన ఆవేదనను చల్లార్చలేదని ఆయనకు తెలుసు. వెళ్లి స్టాఫ్ రూంలోని కుర్చీలో కూర్చున్నారు. మళ్లీ లేవలేదు. ఆయన్ని వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లారు. మనోవేదనతో గుండె ఆగి మరణించినట్లు డాక్టర్లు చెప్పారు. విద్యాబుద్ధులు నేర్పే ఓ ఉపాధ్యాయుడికి దక్కిన గౌరవం, జరిగిన సన్మానం ఇది. అన్నిటికంటే ఘోరమైన విషయం ఏమిటంటే, తొమ్మిదో తరగతి చదివే ఆ పిల్లలకు గంజాయి అలవాటు ఉందని సమాచారం. అయితే పోలీసులు దీన్నింకా ధ్రువీకరించడం లేదు. వాళ్లు క్లాసులో కూడా రౌడీల్లాగే ఉంటారని, అలాగే ప్రవర్తిస్తూ ఇబ్బంది పెడతారని తోటి విద్యార్థులు చెప్తున్నారు. ఇప్పుడు పిల్లల చదువుల మీద వాళ్ల తల్లిదండ్రులకు పెద్ద ఆశలేం లేవు. తమను ఉద్ధరిస్తారన్న పిచ్చి ఊహలు అసలే లేవు. తమ మీదకు కేసులు, కోర్టు గొడవలు తేకపోతే చాలురా దేవుడా అన్నట్లు ఉన్నారు. ఇంటర్‌కు వచ్చేదాకా వాడు గంజాయి బారిన పడకపోతే గొప్ప. డిగ్రీ దాటేదాకా పోలీసులకు చిక్కకపోతే గొప్ప. ఎవర్నీ అత్యాచారం చేయకుండా ఉంటేనో, హెచ్ఐవీ రాకుండా ఉంటేనో మహా గొప్ప. మనదేశంలో 35 శాతం హెచ్ఐవీ కేసుల్లో బాధితుల వయసెంతో తెలుసా? 15–24. మీరు నమ్మకపోయినా ఇదే నిజం. రాన్రానూ మైనర్ల నేరాల సంఖ్య పెరుగుతూ ఉంది. గంజాయి అమ్మకాలు, కొనుగోలులో కూడా వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. మీ పిల్లలు వాళ్ల స్కూళ్లలో, కాలేజీల్లో ఎలా ఉంటున్నారో గమనించుకోండి. భావిభారత రౌడీలు మీ ఇంట్లో నుంచే వెళ్తున్నారేమో ఓ కంట కనిపెట్టండి. ఇక ఉపాధ్యాయుల సంగతి, వాళ్ల ప్రాణాలకు బడిలో రక్షణ లేదని తేలిపోయింది.

హైదరాబాద్‌లో దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేవతి, భర్త భాస్కర్, కొడుకు శ్రీతేజ్, కుమార్తె సాన్వికతో పాటు సంధ్య థియేటర్‌కు పుష్ప–2 ప్రీమియర్ షో చూడటానికి వెళ్లింది. అక్కడికి అల్లు అర్జున్ వస్తున్నాడనే సమాచారంతో విపరీతమైన జనం వచ్చారు. తొక్కిసలాట, ఉద్రిక్తత, పోలీసులు లాఠీఛార్జి చేసిన అదుపులోకి రాలేదు. ఫలితంగా ఆమె కన్ను మూసింది. కొడుకు చావుబతుకుల మధ్య ఉన్నాడు. అసలు ఇలాంటి ప్రీమియర్లకు కుటుంబాలతో ఆడవారితో వెళ్లొద్దని అందరూ సలహా ఇస్తారు. పైగా ఇద్దరు చిన్నపిల్లలను ఈ షోకు పట్టుకెళ్లడాన్ని ఎలా చూడాలి? తన కొడుకు అల్లు అర్జున్ అభిమాని అని, వాడి కోరిక తీర్చడానికి వెళ్లిన ఆ తల్లిదండ్రుల్ని ఏమనాలి? సమాజంలో ఇప్పుడు అన్నింటికంటే కష్టమైన టాస్క్ గుడ్ పేరెంటింగే.

# పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య..!?



(మొదటిపేజీ తరువాయి)

ఉంటుంది. స్టడీ అవర్ పూర్తి చేసిన తర్వాత విద్యార్థులు వారి డార్మిటరీలోకి వెళ్లిన తర్వాత కేర్ టేకర్‌లు అక్కడి నుంచి వెళ్లిపోతారని, తిరిగి ప్రతి రోజు ఉదయం 4.30 గంటలకు స్టడీ అవర్‌లో ప్రిన్సిపల్ క్లాస్ ప్రారంభమవుతుందని తెలిపారు. శుక్రవారం ప్రిన్సిపల్ గణస్వామి స్టడీ అవర్ నిర్వహించడానికి వచ్చే సమాయానికే దిలీప్ రాలేదు. దిలీప్ ఎందుకు రాలేదని విద్యార్థులను ప్రశ్నించి వెంటనే తీసుకు రావాలని సూచించారు. దీంతో విద్యార్థులు దిలీప్‌ను తీసుకు రావడానికి వెళ్లి అన్ని గదుల్లో వెతికారురు. చివరికి డార్మిటరీ వెలుపల వైపు సన్‌సైడ్‌కు ఉన్న హుక్‌కు నైలాన్ తాడుతో ఉరి వేసుకొని వేలాడుతున్నట్టు గుర్తించి ప్రిన్సిపల్‌కు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. సమాచారం తెలిసిన వెంటనే ప్రిన్సిపల్ పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్‌కు, ఎచ్చెర్ల పోలీసులకు సమాచారం చేరవేసి మృతుడి తల్లిదండ్రులకు కబురు పంపినట్టు తెలిసింది. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు ఘటన స్థలానికి చేరుకొని అక్కడ పరిస్థితిని పరిశీలించి ఘటనకు దారితీసిన అంశాలపై పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులు తల్లిదండ్రులు, అధికారులతో మాట్లాడారు. అనంతరం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. మృతుడి తల్లిదండ్రులకు ఎమ్మెల్యే రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఘటనను కలెక్టర్ దృష్టికి తీసుకునివెళ్లి విద్యార్థి మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. సంఘటన స్థలానికి ఆర్డీవో, డీఈవో, తహసీల్దారు, జేఆర్‌పురం సీఐ అవతారం, ఎచ్చెర్ల ఎస్ఐ చేరుకొని విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు సేకరించారు. మృతుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

**సమగ్ర దర్యాప్తు చేయాలి: ఎస్ఎఫ్ఐ**

విద్యార్థి ఆత్మహత్యపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు సీహెచ్ రాజు, చంటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతుడి తల్లిదండ్రులతో ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడారు. గతంలో పాఠశాలలో అనేక మంది విద్యార్థులు మృతి చెందినట్టు తెలిపారు. ఈ నెల ఒకటిన దిలీప్‌ను తల్లి లక్ష్మీ పాఠశాలకు వచ్చి కలిసిందని, ఇంటి దగ్గర ఎలాంటి సమస్య లేదని తల్లిదండ్రులు తెలిపినట్టు వివరించారు. గతంలో ఇలాంటి సంఘటన జరిగినప్పుడు ఈ విద్యార్థి సాక్ష్యం చెప్పాడని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌ను కలిసిన ఎస్ఎఫ్ఐ నాయకులు గతంలో అనేక మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని వివరించారు. గురుకుల పాఠశాలలో ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఇలా జరగడానికి కారణమేమిటో సమగ్ర దర్యాప్తు చేయాలని, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



మృతుని తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయడమే అంబేద్కర్‌కు ఇచ్చే ఘనమైన నివాళి అని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాసు అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళం అంబేద్కర్ జంక్షన్‌లో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, కె.మోహన్‌రావు, జి.సింహాచలం, పి.తేజేశ్వరరావు, పార్టీ నాయకులు ఆర్.ప్రకాష్, ఎ.లక్ష్మి, ఎం.లలిత తదితరులు పాల్గొన్నారు.

**- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.